# నవతరం పరిశోధనలు - 4

## ప్రాచీనసాహిత్య విమర్శ - వాఙ్మయసూచిక



**యం. నారాయణ్ రెడ్డి**, తెలుగుశాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్, తెలంగాణ.
**సెల్** : 9959940932. **మెయిల్** : mnarayanreddy08@gmail.com
**కోర్సు**: Ph.D. **రీసెర్చ్ ఏరియా**: ప్రాచీనసాహిత్యం & విమర్శ
**పర్యవేక్షకులు**: ఆచార్య కె. లావణ్య. **పరిశోధన కాలం**: 2022 నుండి 2027

ప్రాచీన తెలుగు సాహిత్యం ఇతిహాసాలు, కావ్యాలు, పురాణాలు, ప్రబంధాలు, ద్విపదలు, క్షేత్ర మహాత్మ్యాలు, ద్వ్యర్థి కావ్యాలు, యక్షగానాలు, పద కవితలు, వచనములు వంటి విలక్షణమైన ప్రక్రియలతో సుసంపన్నమైనది. కాలక్రమంలో భిన్న నేపథ్యాలతో వెలువడిన ప్రాచీన సాహిత్యానికి సంబంధించిన విమర్శల సూచిని రూపొందించాలనే సత్సంకల్పంతో యం. నారాయణ్ రెడ్డి ఈ పరిశోధన చేస్తున్నారు. ఈ వాఙ్మయ సూచి పఠన సౌలభ్యానికి, పరిశోధనకు ఎంతగానో ఉపకరిస్తుంది.

సాహిత్య రచనలను అక్షరక్రమం, విషయక్రమం, కాలక్రమం లేదా రచయితల పేర్ల ఆధారంగా సమగ్రంగా పొందుపరిచే పద్ధతిని వాఙ్మయ సూచిక అంటారు. ఇవి సర్వ సమగ్రాలు కాకపోవచ్చు. ఇవి పాఠకులకు అవసరమైన పుస్తకాలను సులభంగా కనుగొనడానికి సహాయపడతాయి. పరిశోధకులకు పరిశోధన వ్యాసాలు, సిద్ధాంత గ్రంథాలు, పరిశోధన పత్రికల సమాచారాన్ని అందిస్తాయి. గ్రంథాలయ సిబ్బందికి పుస్తకాల నిర్వహణలో సౌలభ్యాన్ని కల్పిస్తాయి. ఈ వాఙ్మయ సూచికల వలన ఎన్నో ఉపయోగాలున్నాయి.ఇంతవరకు వెలువడిన వాఙ్మయ సూచికలను పరిశీలిస్తే ఎక్కువగా వ్యక్తికేంద్రీకృతంగా వెలువడినట్లు తెలుస్తుంది. ఉదాహరణకు విశ్వనాథ వాఙ్మయ సూచిక, జనమంచి శేషాద్రి శర్మ వాఙ్మయ జీవిత విశేష సూచీ, రాయప్రోలు వాఙ్మయ జీవిత సూచిక, వేటూరి ప్రభాకర శాస్త్రి వాఙ్మయ సూచిక, పోతన వాఙ్మయ జీవిత సూచిక మొదలైనవి. ఇవి కాక బిరుదురాజు రామరాజు తెలుగు వాఙ్మయ కోశం, వేటూరి ప్రభాకర శాస్త్రి తెలుగు కవిత్వ సూచిక వంటి వాఙ్మయ సూచికలు నిర్దిష్ట విషయాలపై కేంద్రీకరించబడి రూపొందించబడ్డాయి. కానీ యమ్.నారాయణ్ రెడ్డి మొదటిసారిగా ప్రాచీన సాహిత్యం పై వెలువడిన పరిశోధన గ్రంథాలను, విమర్శ గ్రంథాలను, వ్యాసాలను, పీఠికలను, సమీక్షలను పరిశీలించి వాఙ్మయ సూచిని రూపొందిస్తున్నారు. ఈ బృహత్ పరిశోధన భావితరాలకు ఎంతగానో ఉపకరిస్తుందని వీరు విశ్వాసం వ్యక్తం చేశారు.

వీరు తమ పరిశోధనను ప్రాథమికంగా అయిదు అధ్యాయాలుగా విభజించారు. అవి : వాఙ్మయ సూచిక స్వరూప స్వభావాలు, ప్రాచీన సాహిత్య విమర్శ వాఙ్మయ సూచిక - పరిశోధన గ్రంథాలు, విమర్శా గ్రంథాలు, పత్రికలు - వ్యాససూచి, పీఠికలు - సమీక్షలు. విశ్వవిద్యాలయాల బయట విజ్ఞాన సర్వస్వాలు, నామ కోశాల నిర్మాణం విస్తృతంగా సాగుతున్న తరుణంలో విశ్వవిద్యాలయాల పరిధిలో వీరీ పరిశోధన చేయడం వర్తమాన పరిశోధకులకు, భావి పరిశోధకులకు ప్రేరణగా నిలిచే విషయం. ఇక ఈ సూచి నిర్మించడానికి అనేకానేక గ్రంథాలను వీరు పరిశీలించవలసి వస్తుంది. ఇది క్షేత్రపర్యటన కన్నా తక్కువేమీ కాదు.

**- సంపత్ కుమార్ బానోజి**

# నవతరం పరిశోధనలు - 5



## తెలుగు కవిత్వం - నదుల ప్రస్తావనలు


**ఒలిగి నరసింహ,** తెలుగుశాఖ, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్, తెలంగాణ

**సెల్:** 9640483979. **మెయిల్:** narsimhaolgi9894@gmail.com

**కోర్సు:** Ph.D. **రీసెర్చ్ ఏరియా:** సాహిత్యం

**పర్యవేక్షకులు:** ఆచార్య సాగి కమలాకరశర్మ. **పరిశోధనకాలం:** 2020 నుండి 2025


ఎప్పుడు ఎడతెగక పారే నదులున్నచోట నివసించాలని బద్దెన మాట. అందుకే మన పూర్వీకులు, మహర్షులు నదుల చుట్టూ తమ జీవనాన్ని ఏర్పరచుకున్నారు. జీవ నదులు మనకు భగవంతుడు ప్రసాదించిన ప్రకృతి వనరులు. సనాతన సంస్కృతి, సాంప్రదాయాలన్నీ నదులతో పెనవేసుకొన్నవే. నదుల వల్ల మనకు తాగు, సాగునీరు లభిస్తున్నాయి. ఇలాంటి భౌతిక అవసరాలకు మాత్రమే కాదు, ఆధ్యాత్మిక ఆనందాలతో మనల్ని పరవశింపజేస్తాయి పావన నదులు అంటూ నదులపైనున్న గౌరవాదరాలతో, భక్తిప్రపత్తులతో ఒలిగి నరసింహ చేస్తున్న పరిశోధన తెలుగు కవిత్వం - నదుల ప్రస్తావన. మానవ జీవనానికి ఆధారమైన నదుల గురించి, వాటి ప్రాశస్త్యం గురించి నేటి తరానికి తెలియజెప్పాలనే లక్ష్యంతో వీరు చేస్తున్న పరిశోధన ఇది. తెలుగు సాహిత్యంలో వివిధ కవులు, వివిధ నదులను వర్ణించిన విధానాన్ని, వాటి ప్రాశస్త్యాన్ని ఎలా తెలియజెప్పారనే విషయాన్ని వీరు తమ పరిశోధన ద్వారా వివరించనున్నారు. వీరు తమ పరిశోధనను ప్రాథమికంగా ఐదు అధ్యాయాలుగా విభజించారు. అవి: జల ప్రాధాన్యం - నదుల అవసరం, పర్యావరణ ప్రాధాన్యం; పురాణ సాహిత్యంలో నదుల ప్రస్తావన; కావ్యాలలో నదుల ప్రస్తావన; ప్రబంధాలలో నదుల ప్రస్తావన, ఆధునిక కవిత్వంలో నదుల ప్రస్తావన.

వీరి పరిశోధన భౌతిక, తాత్త్విక దృక్కోణాలలో సాగుతుంది. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం వీరి అధ్యాయాల విభజన. మొదటి అధ్యాయంలో జలం యొక్క విశిష్టతను, నదుల ప్రాముఖ్యతను తెలియజెప్పి ప్రపంచ సంస్కృతులపై నదుల ప్రభావాన్ని తెలియజేశారు. ఆపై పర్యావరణంలో నీటి కాలుష్యం గూర్చి వివరించారు. ఈ అధ్యాయాన్ని నిర్మించడానికి వీరు వేదాన్ని, పర్యావరణ శాస్త్రాలను ఆలంబనగా చేసుకున్నారు. రెండవ అధ్యాయంలో వేదాలు, అరణ్యకాలు, బ్రాహ్మణాలు, ఉపనిషత్తులు, పురాణాలలో నదుల ప్రస్తావన గూర్చి తెలియజేశారు. ఈ అధ్యాయం ద్వారా నదుల ఉనికిని, ప్రాచీనతను తెలియజెప్పారు. మూడవ అధ్యాయంలో ప్రత్యేకించి తెలుగు రామాయణాలు, భారతంలో నదుల ప్రస్తావనలను తెలియజేసి ఆపైన మూలంలోనున్న విశేషాలను కూడా వివరించారు. నాలుగవ అధ్యాయంలో ప్రబంధాలలో ఉన్న నదుల వర్ణనలను విస్తృతంగా వివరించారు. ఇక చివరి అధ్యాయంలో ఆధునిక కవిత్వంలో పద్య, వచన, గేయ ప్రక్రియల్లో పొందుపరిచిన నదుల ప్రస్తావన గూర్చి, నదీ కావ్యాల గూర్చి ప్రస్తావించనున్నారు. వీరి అధ్యాయాలలో విస్తృతమైన అధ్యాయం ఇదే. ఈ చివరి అధ్యాయ నిర్మాణంలో నదుల ప్రస్తావన గల పుస్తకాలను సేకరించడం తమ పరిశోధనలో తానెదుర్కుంటున్న సమస్యని నరసింహ తెలియజెప్పారు. వీరికి ముందు నదులపై డా. సంగారెడ్డి తెలుగు కావ్యాల్లో నదుల ప్రస్తావన అనే సిద్ధాంత గ్రంథాన్ని వ్రాయగా, ఆరునదులు సమగ్రపరిశీలన అనే ఎం.ఫిల్ గ్రంథాన్ని ఎస్. సుదర్శనరావు రచించారు. వీరి తరువాత తెలుగు ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను అధ్యయనం చేసి నరసింహ ప్రకటిస్తున్న ఈ సిద్ధాంత గ్రంథం సమగ్రమైనది.

**- సంపత్ కుమార్ బానోజి**

# నవతరం పరిశోధనలు - 6

## జువ్వాడి గౌతమరావు జీవితం - వాఙ్మయసేవ



**చక్రహరి రమణ,** తెలుగుశాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్, తెలంగాణ.
**సెల్:** 9247226292. **మెయిల్:** ramana.chakrahari@gmail.com
**కోర్సు:** Ph.D. **రీసెర్చ్ ఏరియా:** విమర్శ
**పర్యవేక్షకులు:** ఆచార్య వి. త్రివేణి. **పరిశోధనకాలం:** 2022 నుండి 2027

విశ్వనాథ కల్పవృక్షములోని కమనీయపద్యాలను తన మృదుమధురమైన గాత్రంతో గానంచేస్తూ, కరీంనగర్ లో సాహితీవటవృక్షంగా వేలాదిమంది సాహితీకారులకు ఆశ్రయమిచ్చి తెలుగు సాహిత్యాన్ని కాపాడుతూ, అనేక కవితా గోష్ఠులలో పాల్గొంటూ వాఙ్మయ సేవ చేసిన జువ్వాడి గౌతమ రావు గారి పైన చక్రహరి రమణ చేస్తున్న పరిశోధన ఇది.

జువ్వాడి గౌతమ రావు కేవలం సాహితీవేత్త మాత్రమే కాదు. ఉత్తమ విమర్శకులు కూడా. ఆపైన దేశభక్తి, సామాజిక సేవా దృక్పథం, విప్లవ భావజాలం కలిగిన విలక్షణ లక్షణ సంపన్నులు. ఆధునిక కాలంలో అడుగంటిపోతున్న సంప్రదాయ కవితా పరిరక్షణ కోసం పాటుపడిన ధన్యజీవి. వీరు తమ పదునైన విమర్శ దృక్పథంతో కవుల తప్పొప్పులను సూటిగా ప్రశ్నించిన మేధావి. ఈ క్రమంలోనే వీరు అనేక వ్యాసాలను ప్రకటించారు. వీటితోపాటు వీరు రచించిన పీఠికలను, లేఖలను వనరులుగా స్వీకరించి చక్రహరి రమణ ఈ పరిశోధన చేస్తున్నారు. ఈ పరిశోధన ద్వారా జువ్వాడి గౌతమరావు గారి జీవిత విశేషాలను నేటి తరానికి తెలియజెప్పడం. వీరి లోతైన విమర్శ శైలిని అధ్యయనం చేస్తూ పదునైన విమర్శకునిగా జువ్వాడి గౌతమరావును ఆవిష్కరించడమనే లక్ష్యాలతో వీరీ పరిశోధన చేస్తున్నట్లు తెలిపారు.

పరిశోధన సౌలభ్యం గూర్చి తమ సిద్ధాంత గ్రంథాన్ని ప్రాథమికంగా అయిదు అధ్యాయాలుగా విభజించారు. అవి : జువ్వాడి గౌతమరావు జీవితం; జువ్వాడి గౌతమరావు విమర్శ వ్యాసాలు; జువ్వాడి గౌతమ రావు వచన రచనలు; నవలా విమర్శ; బాషా, వ్యాకరణ విశేషాలు. చక్రహరి రమణ అభిప్రాయంలో జువ్వాడి వ్యాసాలు, లేఖలు చాలా లోతైనవి. అందులో వారు ప్రస్తావించిన సందర్భాలు, పాత్రలు, పద్యాలు ఎక్కడ నుండి ఉటంకించారో తెలుసుకోవడం తాను పరిశోధనలో ఎదుర్కొంటున్న సమస్య అని తెలియజేశారు.

దేశభక్తి పరాయణునిగా, సోషలిస్టు ఉద్యమకారునిగా, దాతగా, జయంతి పత్రిక సంపాదకునిగా, విమర్శకునిగా వినూత్న వ్యక్తిత్వం కలిగిన జువ్వాడి గౌతమరావు విమర్శకులకు, సాహితీవేత్తలకు స్ఫూర్తిప్రదాత. అటువంటి జువ్వాడి అంతరంగాన్ని అర్థం చేసుకుని నాటి సమకాలీన పరిస్థితుల పైన, సాహిత్యం పైన విస్తృత అవగాహన ఏర్పరచుకుంటే ఈ పరిశోధన విజయవంతం అవుతుంది. ఈ పరిశోధన ద్వారా విమర్శ ఎలా చేయాలి, విమర్శకుని బాధ్యత ఏమిటని ఉదాహరణ పూర్వకంగా నిరూపించిన వారవుతారు.

**- సంపత్ కుమార్ బానోజి**

**(మరికొన్ని పరిశోధనల పరిచయం వచ్చే సంచికలో...)**